క్లుప్తంగా

హైస్కూల్‌కు కుర్చీల బహూకరణ



పమిడిముక్కల: ఐనపూరు హైస్కూల్‌కు కూడేరు గ్రామానికి చెందిన దాత దొడ్డా సూర్య వెంకటప్రసాద్ రూ.15 వేలు విలువైన 20 కుర్చీలను బహూకరించారు. హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో వెంకటప్రసాద్ కుర్చీలను ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావుకు అందజేశారు. హైస్కూల్ అభివృద్ధికి సహకరిస్తున్న దాతను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. సర్పంచ్ వీర్ల నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు వీర్ల ఆదిశేషు, ఐనపూరు సర్పంచ్ కొండా జయలక్ష్మి, బసివిరెడ్డి దంపతులు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ దూడల శివనాగభవాని పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్ : ఓపెన్ కరాటే పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి పతకాలు సాధించారని గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. బుధవారం పాఠశాల ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన చెన్నైలో జరిగిన ఆల్ ఇండియా 22వ మవాతికా షిటోరియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-14 విభాగంలో వ్యక్తిగత కుమితేలో తమ విద్యార్థులు కె. సాయిచరణ్, కె. కౌషిక్, డి. ఉజ్వల్ ప్రతిభను ప్రదర్శించి బ్రాంజ్ మెడల్ సాధించారని తెలిపారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను, కోచ్ ఎస్. వెంకటేశ్వరరావును ప్రిన్సిపాల్స్ ఎం.సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.

జీఎస్టీ రేట్ల తగ్గుదలపై అవగాహన



మండవల్లి: ఇంటి నిర్మాణ సామగ్రి సిమెంట్‌పై జీఎస్టీ రేట్లు తగ్గుదలపై మండవల్లిలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రేట్లు తగ్గడం వలన కలిగే ప్రయోజనాలను అధికారులు, ప్రజాప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వై రామకృష్ణ, సర్పంచ్ మెండా ఝాన్సీ, కార్యదర్శి గిరిజ పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాల తనిఖీ



నందివాడ: మండలంలోని పోలుకొండ జిల్లా పరిషత్ పాఠశాలను బుధవారం మండల విద్యాశాఖ అధికారి డేవిడ్ రత్నరాజు తనిఖీ చేశారు. ఆయన మధ్యాహ్నం భోజనం వండుతున్న తీరును, పాఠశాలల పరిసరాలు, పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు ఆరోగ్యం, చదువు ప్రధానమైనవని అన్నారు. అదేవిధంగా పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రాకూడదని ఆదేశించారు. రోజువారి మెనూను పక్కాగా అమలు చేయాలన్నారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత పాఠశాల హెచ్ఎం వి.మణి, కె.శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



కైకలూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆచవరం గ్రామంలోని బుర్ల రామస్వామి, తులసమ్మకు చెందిన పూరిల్లు మంగళవారం రాత్రి దగ్ధమైంది. దాదాపు రూ.60 వేలు నగదు, రెండు కాసుల బంగారం, ఆధార్, రేషన్ కార్డులు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.3లక్షలు నష్టం వాటిల్లిందని భావిస్తున్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బుర్ల కిరణ్ బాధితులకు బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టేది ఎప్పుడో?



అధ్వానంగా మారిన ట్యాక్సీ స్టాండ్ రోడ్డు



వర్షం నీటితో నిండిన గుంతలు

గుడివాడ టౌన్ : గుడివాడ పట్టణంలో పలు రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారాయని ఆరోపిస్తున్నారు. స్థానిక 4వ వార్డు గౌరీశంకరపురంలోని ట్యాక్సీ స్టాండ్ నుంచి బ్రహ్మకుమారి సమాజం వరకు గల రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో అత్యంత ప్రాధాన్యం గల ఈ మార్గంలో నిత్యం వాహనాలు, ప్రజలు అధిక సంఖ్యలో ప్రయాణం చేస్తారు. ఎన్టీఆర్ కాలనీ, పెద్దవీధి, మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాల ప్రజలు ఏలూరు రోడ్డు చేరుకోవాలంటే ఈ మార్గాన్నే ప్రయాణిస్తారు. దీనికి తోడు నందివాడ మండలంలోని అన్ని గ్రామాలకు వెళ్లే ఆటోలు వందల సంఖ్యలో ఇక్కడ తిరుగుతుంటాయి. ఆ ప్రాంత వర్తకులు, ప్రజలు ఇక్కడకు చేరుకుని వివిధ ప్రాంతాలకు వెళ్లడం సర్వసాధారణం. ఆటోలు మండలంలోని అన్ని గ్రామాలను కలుపుకుంటూ వెళ్లే ఆర్టీసీ బస్సులు ఇక్కడ నుంచే ప్రారంభమవుతాయి. ఇంతటి ప్రధాన రహదారి అధ్వానంగా మారినా పాలకులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టించుకోని కూటమి నాయకులు

ఏడాదిన్నర గడుస్తున్నా కూటమి నాయకులు ఈ రోడ్డును పట్టించుకోవడంలేదని స్థానికులు, పరిసర గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డుపై మూడు ప్రధాన గుంతలు ఏర్పడగా అవి వర్షం వస్తే చెరువును తలపిస్తున్నాయి. ఇటీవల రూ. 4 కోట్లు పట్టణాభివృద్ధికి సీఆర్‌డీఏ నిధులు రాగా ఈ రోడ్డు పనులు పట్టించుకోకుండా టీడీపీ బడా నాయకుల నివాసాలవైపు మెరుగైన వసతులతో రోడ్లు ఏర్పాటు చేయడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. దీనిపై మున్సిపల్ ఇంజినీర్‌ను వివరణ కోరగా ఈ రోడ్డు పనులు త్వరలో చేపడతామని రూ.87 లక్షల అంచనాలతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామన్నారు. రోడ్డు నిర్మాణ పనులను ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లామని ఆయన ఆమోదం తెలిపాక టెండర్లు పిలుస్తామన్నారు. కాగా ప్రజా ప్రతినిధులు అన్ని ప్రాంతాలను సమాన దృష్టితో అభివృద్ధి చేయాలని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

రోడ్ల నిర్మాణం చేపట్టాలి



పట్టణంలోను, గ్రామాల్లోను రోడ్ల సమస్య అధికంగా ఉంది. గుంతలు పూడుస్తున్నాం అన్నారే గాని కూటమి నాయకులు వాటిని పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వంలో మంజూరైన రోడ్ల పనులు రద్దు చేయడం సరి కాదు. అధికారులు వెంటనే స్పందించి రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

– తులిమిల్లి యెషయ్య

శివారు ప్రాంతాలపై దృష్టి పెట్టండి



గత ప్రభుత్వంలో శివారు ప్రాంతాల రోడ్ల నిర్మాణానికి రూ. 3.98 కోట్లు మంజూరు కాగా వాటి పనులు చేపట్టకపోవడం విచారకరం. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే ప్రస్తుతం అది జరగడం లేదు. ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ రోడ్ల నిర్మాణం చేపట్టాలి.

– షేక్ సయ్యద్

వైఎస్సార్ సీపీ నాయకుడికి డీఎన్నార్ పరామర్శ



సుబ్బలక్ష్మి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి, మండవల్లి మండలం చింతపాడు గ్రామానికి చెందిన బలే నాగరాజు మాతృమూర్తి సుబ్బలక్ష్మి (75) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) బుధవారం చింతపాడులో ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చేబోయిన వీరరాజు, మండవల్లి, మండల అధ్యక్షుడు బేతపూడి ఏసేబురాజు, శింగంశెట్టి రాము, పులపర్రు ఎంపీటీసీ సభ్యుడు రమేష్, నాయకులు గోకర్ణయాదవ్, గోపాలకృష్ణ, రామారావు, నాగు, అంజి, యేసు, ఏడుకొండలు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు



విద్యుత్ మీటర్లను తనిఖీ చేస్తున్న అధికారులు

ముదినేపల్లి రూరల్: మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 2,612 సర్వీసులను తనిఖీ చేసి వినియోగదారులకు రూ.16.27 లక్షల జరిమానా విధించారు. విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు ఆధ్వర్యంలో 46 బృందాలు పలువురు అధికారుల ఆధ్వర్యంలో సర్వీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 452 సర్వీసుల మీటర్లలో అదనపు లోడు మొత్తాన్ని రూ.15.52 లక్షలు వసూలు చేశారు. అదేవిధంగా విద్యుత్ చౌర్యం చేస్తున్న ఎనిమిది సర్వీసులకు సంబంధించిన వినియోగదారులకు రూ.75,694 జరిమానా విధించినట్లు గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాస్ తెలిపారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే సెల్ నంబర్ 94408 12091, 94408 12086కు సమాచారం అందించాలన్నారు. తనిఖీల్లో గుడివాడ రూరల్ ఏడీఈ కిరణ్‌బాబు, ముదినేపల్లి ఏఈఈ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోని కూటమి ప్రభుత్వం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

చినముత్తేవి(మొవ్వ): జిల్లాలో వ్యవసాయ కార్మికులకు పనులు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని, వలసలు నివారణకు, ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు పేర్కొన్నారు. మొవ్వ మండలం చినముత్తేవి గ్రామంలో అజయ్ కుమార్ భవనంలో కృష్ణా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సమావేశాన్ని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సభ్యులకు అనుకూలంగా విధానాలు రూపొందిస్తూ పేదలను పట్టించుకోవటం లేదని ఆరోపించారు. వ్యవసాయ భూములను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులు, వ్యవసాయ కార్మికులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతుందన్నారు. ఉపాధి హామీ పనికి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అజ్మీర్ వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ, పోతురాజు విగ్రహాల ఊరేగింపు



గంగానమ్మ, పోతురాజుల ఊరేగింపు



కనక దప్పుల వాయిద్యాలతో ఊరేగింపు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో గంగానమ్మ తల్లి అమ్మవారు, పోతురాజు నూతన విగ్రహాల ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు. కనక డప్పులు, మేళతాళాల నడుమ అమ్మవారి ఊరేగింపు గ్రామ పుర వీధుల్లో చేపట్టారు. ఆలయ జీర్ణోద్ధరణ సందర్భంగా ఈ విగ్రహాలను మహాబలిపురం నుంచి నిర్వాహకులు తీసుకొచ్చారు. ఈ ఊరేగింపులో స్థానిక భక్తులు అమ్మవారికి టెంకాయలు, పండ్లు సమర్పించి పసుపు నీరు వారపోసి అమ్మవారికి ఘన స్వాగతం పలికారు.

డ్రెయిన్‌లో గుర్రపుడెక్కతో ఇక్కట్లు



వెంట్రప్రగడలోని పాలకోడ్ డ్రెయిన్‌లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క

పెదపారుపూడి: మండలంలోని వెంట్రప్రగడలో ఉన్న పాలకోడ్ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, దట్టంగా అల్లుకుపోవటంతో చిన్నపాటి వర్షానికే పంట పొలాలు నీట మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకోడ్ డ్రెయిన్‌లో గుర్రపుడెక్కను తొలగించాలని డ్రెయినేజీ అధికారులకు పలుమార్లు చెప్పినా ఫలితం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా డ్రెయినేజీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రోడ్లపై చెత్త వేయకండి

మున్సిపల్ కమిషనర్



గుడివాడ టౌన్ : పట్టణం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజల సహకారం అవసరమని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని 24వ వార్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల నుంచి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి వార్డులోను చెత్త సేకరించేందుకు అవసరమైన సిబ్బంది, వాహనాలు అందుబాటులో ఉన్నాయని వాటిని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. మురుగుకాల్వలో నీరు ఉండటాన్ని గమనించి వాటిని తొలగించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషనర్ సిబ్బందికి సూచించారు.

అన్నసమారాధన

మండవల్లి: లోకుమూడిలో కొలువైఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో సకల మాలాధారులకు అన్నదాన (భిక్ష) కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద ఏకశిలా పదునెట్టాంపడి(18 మెట్లు) కలిగిన శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో వరుసగా 18 ఏళ్ల నుంచి దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం జరుగుతున్నట్లు ఆలయ గురుస్వామి అప్పారావు తెలిపారు. సర్వమాలాధారులకు వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ధాన్యంలో తేమ శాతం గుర్తించేందుకు శిక్షణ



పెదపారుపూడి: రైతుల తీసుకొచ్చే ధాన్యంలోని తేమ శాతం గుర్తించేందుకు శిక్షణ తీసుకోవాలని తహసీల్దార్ ఎం. శ్రీనునాయక్ అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో వీఏఏ, టీఏలకు ధాన్యం కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ధాన్యం నమూనాలు ఎలా సేకరించాలి, ధాన్యంలోని తేమ శాతం ఎలా గుర్తించే విషయాలపై శిక్షణ ఇస్తారన్నారు. మండల వ్యవసాయాధికారి ఆంజనేయరావు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ఉచ్చులో పడొద్దు

కైకలూరు: సోషల్ మీడియాను అడ్డుపెట్టుకుని సైబర్ నేరగాళ్లు ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్నారని, ఆన్‌లైన్‌లో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మవద్దని ఎస్ఐ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. కైకలూరు పట్టణ సీఐ ఏవీఎస్.రామకృష్ణ ఆదేశాలతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, పోక్సో చట్టంపై బుధవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ లైంగిక వేధింపులపై యువతులు ధైర్యంగా పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ఇటీవల కాలేజీల్లో ఇద్దరి మధ్య స్నేహం చెడితే గతంలో చనువుగా దిగిన ఫొటోలతో అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారన్నారు. ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఫేస్ బుక్, ట్విట్టర్, వాట్సాప్ వంటి సోషల్ నెట్‌వర్క్‌లను అవసరం మేరకు మాత్రమే వినియోగించాలన్నారు. బ్యాంక్ నుంచి ఫోన్ చేసినట్టు నమ్మించి ఏటీఎం పిన్ నంబర్లు అడిగితే చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ శాంతి జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు రూ.10 వేల విరాళం

గుడ్లవల్లేరు: స్థానిక శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థాన జీర్ణోద్ధరణ పనులకు బుధవారం రామిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, మంగలక్ష్మి దంపతులు రూ.10,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి, బాబి, నాని తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి



గుడివాడలో ప్రయోగశాలలో అంశాలను వివరిస్తున్న డాక్టర్ ఎన్ శివప్రసాద్

గుడివాడ టౌన్ : ప్రతి విద్యార్థి తనలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి మెరుగుపరుచుకోవాలని ఐఐటీ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శివప్రసాద్ అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల్లో బుధవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని 'డ్రీమ్స్ టు రియాలిటీ, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' అనే అంశాలపై ప్రయోగాత్మక అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



పామర్రులో ఉత్తమ ఉపాధ్యాయుడు శివరామప్రసాద్‌ను సత్కరించిన కళాపీఠం సభ్యులు

పామర్రు: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను స్థానిక హితమ్ స్కూల్లో ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్ష కార్యదర్శులు కాటూరి వెంకట మురళీకృష్ణ, నందిపాటి హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని ఆధునిక పరిజ్ఞానంతో ముందుకు తీసుకెళ్లడంలో కలాం చేసిన కృషి అభినందనీయమన్నారు. కలాం రాష్ట్రపతిగా ఉన్నప్పటి నుంచి దేశంలో మన సొంత పరికరాలతో రాకెట్ ప్రయోగాల ప్రారంభానికి కృషి చేశారన్నారు. తొలుత అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శివరామప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలక్ష్మీ, తనూజ, విజయలక్ష్మీ, పల్లవి, దేవి, పద్మజ పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీలకు అక్కాచెల్లెళ్లు ఎంపిక



రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన అక్కాచెల్లెళ్లు

ముదినేపల్లి రూరల్: మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 2,612 సర్వీసులను తనిఖీ చేసి వినియోగదారులకు రూ.16.27 లక్షల జరిమానా విధించారు. విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు ఆధ్వర్యంలో 46 బృందాలు పలువురు అధికారుల ఆధ్వర్యంలో సర్వీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 452 సర్వీసుల మీటర్లలో అదనపు లోడు మొత్తాన్ని రూ.15.52 లక్షలు వసూలు చేశారు. అదేవిధంగా విద్యుత్ చౌర్యం చేస్తున్న ఎనిమిది సర్వీసులకు సంబంధించిన వినియోగదారులకు రూ.75,694 జరిమానా విధించినట్లు గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాస్ తెలిపారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే సెల్ నంబర్ 94408 12091, 94408 12086కు సమాచారం అందించాలన్నారు. తనిఖీల్లో గుడివాడ రూరల్ ఏడీఈ కిరణ్‌బాబు, ముదినేపల్లి ఏఈఈ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తను సేకరించండి



వరహాపట్నంలో చెత్త సేకరణ రిక్షాల వద్ద సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ

కైకలూరు: గ్రామీణ ప్రాంతాల్లో తడి, పొడి చెత్తను విడివిడిగా పారిశుద్ధ్య కార్మికులు సేకరించాలని ఎంపీడీఓ ఆర్.రాజబాబు సూచించారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాండ్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) నుంచి వచ్చిన సమాచారంపై ఆయన వరహాపట్నం, గోపవరం, రాచపట్నం సచివాలయాల సిబ్బందితో కలసి బుధవారం పర్యటించారు. వరహాపట్నంలో సర్పంచ్ ఉప్పలపాటి నాగమణితో కలసి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. డ్రెయినేజీల్లో మురుగునీరు లేకుండా బాగు చేయాలని పారిశుద్ధ్య కార్మికులకు చెప్పారు. వర్షాల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ప్రాధాన్యతాంశలైన డోర్ టు డోర్ చెత్త సేకరణ, ఐవీఆర్ఎస్ కాల్స్, సూపర్ జీఎస్టీ, వాట్సాప్ గవర్నెన్స్ కార్యక్రమాల పురోగతిని సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఈఓ కె.బాలశంకర్ పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గుడ్లవల్లేరు: పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల నియంత్రణపై రెండో రోజు జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ ఎన్.సీహెచ్.నరసింహులు అవగాహన సదస్సును కొనసాగించారు. బుధవారం స్థానిక వెటర్నరీ ఉప సంచాలకుల పశుసంవర్థక శాఖ వారి కార్యాలయంలోని మీటింగ్ హాల్లో కృష్ణా జిల్లా పశు సంవర్ధక సహాయకులకు ఈ సదస్సును నిర్వహించారు. పశుసంవర్ధక సహాయకులకు ఉద్యోగం పట్ల అనుసరించాల్సిన విధానాలు, భారత్ పశుధన్ నిర్వహించుకునే విధానంతో పాటు అనేక శాఖా పరమైన విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ గుడివాడ డివిజనల్ ఉప సంచాలకులు డాక్టర్ సి.శ్రీనివాస్, ఇంటర్నేషనల్ ఎన్జీఓ డాక్టర్ సాహిల్ పాల్గొన్నారు

కల్తీ మద్యం కేసును సీబీఐకి అప్పగించాలి

కైకలూరు: కల్తీ మద్యం లిక్కర్ కుంభకోణం కేసును ప్రభుత్వం సీబీఐకి అప్పగించాలని వైఎస్సార్ సీపీ ఈసీ సభ్యులు, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి బీవీ.రావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డైవర్షన్ రాజకీయాల్లో భాగంగానే బీసీ నేత జోగి రమేష్ పేరును జనార్దన్‌రావుతో చెప్పించారనే విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. బడుగు, బలహీన వర్గాల మద్యపాన ప్రియులు కల్తీ చీప్ లిక్కర్ తాగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం షాపులు నడిపి, 44 వేల బెల్టు షాప్‌లను మూసివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే మద్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చి, లక్ష బెల్టు షాప్‌లను తెరిచారని విమర్శించారు. జోగి రమేష్ సత్యశోధన పరీక్ష సవాలును ప్రభుత్వం స్వీకరించాలన్నారు.

బాణసంచా విక్రయదారుడిపై కేసు నమోదు

కలిదిండి(కైకలూరు): లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తున్న దుకాణదారుడిపై కలిదిండి పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు కలిదిండి పంచాయతీ పరిధి ఇందిరాకాలనీలో ముప్పన శ్రీను బడ్డీకొట్టు వద్ద టపాసులు విక్రయిస్తున్నాడు. పోలీసులు దాడి చేయగా తాటాకు టపాకాయిలు, మతాబులు, చిచ్చుబుడ్లు, కాకరపువ్వొత్తులు వంటి రూ.6,490 సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కలిదిండి హెడ్ కానిస్టేబుల్ కె.రాంబాబు కేసు నమోదు చేశారు.